TELANGANA CAPITAL
తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
TELANGANA CAPITAL NEWS
www.telanganacapitalnews.com





## నేత్రపర్వంగా ముగిసిన నరసింహ స్వామి రథోత్సవం

తెలంగాణ క్యాపిటల్, బెజ్జంకి: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యఘట్టమైన రథోత్సవం గురువారం ఘనంగా ముగిసింది. మొదటగా రథం ముందు హెూమ గుండాన్ని ఏర్పరిచి హెూమం నిర్వహించడం జరిగింది. అనంతరం దిష్టి కుంభ కార్యక్రమం చేపట్టారు. తర్వాత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఉత్సవ మూర్తుల విగ్రహాలను రథం చుట్టూ వేదమంత్రాలతో సన్నాయి మేళ తాళాల మధ్య ప్రదక్షిణ జరిపారు. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలను వ్రతంలో ప్రతిష్టించి రథాన్ని ఆలయ ప్రాంగణం లోని గుడి చుట్టూ తిప్పడం జరిగింది. వేలాదిమంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి వచ్చి స్వామి వారిని సేవించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా నమో నారసింహ, గోవిందా, గోవిందా అనే నామస్మరణలతో మార్మోగింది. రథంపై ప్రతిష్టించిన ఉత్సవమూర్తుల విగ్రహాలకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించినారు. దేహమే దేవాలయం దాన్ని ఆధారం చేసుకుని ఈ రథం భక్తుల మనోరథాన్ని నెరవేర్చటానికి ప్రతిఏటా రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనవాయితీ. ఆత్మ సారథుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, దేహం వల్ల స్థూల శరీరం వేరని, సూక్ష్మ శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమని పలువురు అంటున్నారు. రతోత్సవం వల్ల భక్తుల మనోరతాన్ని నెరవేర్చటానికి ప్రతి ఏటా రథోత్సవ కార్యక్రమం నిర్వహించటం ఆనవాయితీ. పలువురు భక్తులు దివిటీలు వెలిగించి తాము చేసిన పాపాలు తొలగిపోవాలని కోరుతూ స్వామివారిని వేడుకుంటారు. అలాగే కోళ్ళు, గొర్లు, మేకలు, బలిచ్చి తమ తమ మొక్కులను తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను సిద్దిపేట సీఐ ఎం. శ్రీనివాస్, బెజ్జంకి ఎస్సై జే.కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పలువురు పాల్గొని పర్యవేక్షించారు.




## చదువుతోనే సమాజంలో గౌరవం

**భవిష్యత్తులో కూడా మంచి ర్యాంకులు సాధించాలి.. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి**

తెలంగాణ క్యాపిటల్, రామడుగు: చదువుతూనే సమాజంలో గౌరవం దక్కుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో రామడుగు మండలం గోపాలరావుపేట అల్ఫోర్ జూనియర్ కళాశాలలో రాష్టస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా ర్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడుతూ కష్టపడి చదువుతేనే భవిష్యత్తులో ఏదైనా సాధించగలం అని, భవిష్యత్తులో తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని విద్యార్థులకు మనోధైర్యాన్ని నింపారు.



## కేజీబీవీ విద్యార్థులకు అదనపు కలెక్టర్ అభినందన

**తెలంగాణ క్యాపిటల్, సిరిసిల్ల:** ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన కేజీబీవీ విద్యార్థులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ అభినందించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో అభినందించి, ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఇంటర్ ద్వితీయ సంవత్సరం లో కె.జి.బి.వి. సిరిసిల్ల MPC. గంగాభవాని 987 /1000, కెజిబివి. మర్రిపల్లి BiPCలో ఎం. ప్రసన్న 978 /1000, కేజిబివి తంగళ్లపల్లి సీఈసీలో జి.వైష్ణవి 911/1000, ఎంపీహెచ్‌డబ్ల్యూలో పి.హాసిని 980 /1000, ప్రథమ సంవత్సర ఫలితాలు కే.జి.బి.వి.సిరిసిల్లలో కె.వైష్ణవి 433/440, కే.జి.బి.వి. మర్రిపల్లి, ఎంపీసీలో జి. హస్విత 453/470. కెజిబివి రుద్రంగి, హరిక 452/470, కే.జి.బి.వి. తంగల్లపల్లి, సీఈసీలో వై.అశ్విని 440/500, ఎంపీహెచ్‌డబ్ల్యూలో సిఎచ్. రేష్మ 480/500 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 205 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు అందులో 174 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం 271 మంది విద్యార్థులకు 230 మంది ఉత్తీర్ణత సాధించారు మొత్తం 85% విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కార్యక్రమంలో డీఈఓ రమేశ్ కుమార్, సెక్టోరల్ అధికారి పద్మజ, కేజీబీవి పాఠశాలల స్పెషల్ ఆఫీసర్స్, టీచర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.